సమాచారం

శోభకృత్‌లో ప్రజలందరికీ శుభం జరగాలి

● జిల్లా ప్రజలకు కలెక్టర్ అమయ్ ఉగాది శుభాకాంక్షలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: శోభకృత్ నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ శుభం జరగాలని, ప్రతి ఒక్కరు భోగభాగ్యాలతో ఆనందంగా ఉండాలని మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ అమయ్‌కుమార్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ఉగాది పండగా ఎంతో ప్రాముఖ్యమైనదని, ఈ పండగ అంటేనే షడ్రుచుల సమ్మేళనమన్నారు.

28న తైబజార్ వేలంపాట

కీసర: నాగారం మున్సిపాలిటీ నాగారం, రాంపల్లిలో ఈ నెల 28వ తేదీ మంగళవారం నాడు తైబజార్ వేలం పాట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వాణీరెడ్డి తెలిపారు. తైబజార్ వేలం పాటలో పాల్గొనదలచే వారు 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కమిషనర్ నాగారం మున్సిపాలిటీ పేరున రూ.2లక్షలతో కూడిన డీడీని కార్యాలయంలో అందజేసి వేలం పాటలో పాల్గొనాలని ఆమె తెలిపారు.

నేటి నుంచి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు

కీసర: కీసర శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలను నేటి(బుధవారం) నుంచి వైభవంగా ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో పెద్ద ఎత్తున ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా మొదటిరోజైన బుధవారం గురువందనంతో ప్రారంభమై శాంతిపాఠం, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, ఉదయం 10 గంటలకు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 23న దేవతానిత్య పూజ, రుద్రహోమం, సాయంత్రం ప్రదోషకాల పూజ, దీపారాధనసేవ, 24న హోమాలు, ఉదయం 10 గంటలకు యంత్ర ప్రతిష్ఠాపన, మూర్తి ప్రతిష్ఠ, మహాపూజ, బలిహరణం, శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవం తదితర పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అన్ని వర్గాల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు పరుస్తోందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లుబాయి, జెడ్పీటీసీ అనితలాలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, సర్పంచ్‌లు శివశంకర్, వెంకటేశ్‌గౌడ్

ఘట్‌కేసర్: ప్రతాపసింగారంలో నేటి(బుధవారం) నుంచి ప్రారంభంకానున్న గుబ్బరిగుట్ట మైసమ్మ, ఎల్లమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, సర్పంచ్ శివశంకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో జరుగుతున్న పనులను వారు మంగళవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మార్చి 22 నుంచి 24వ తేదీ వరకు వేడుకలు నిర్వహిస్తామని, 26న బోనాల సమర్పణతో పూజలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో కొర్రెముల్ సర్పంచ్ వెంకటేశ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ కిట్ల పంపిణీ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో చెత్త లేకుండా నిత్యం శుభ్రం చేస్తున్న ఘట్‌కేసర్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం హెల్త్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు ఏడాదికి సరిపోను సబ్బులు, నూనె, చెప్పులు, దుస్తులు, టవాల్స్ అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, నస్రీన్ సుల్తానా, మున్సిపల్ మేనేజర్ అంజిరెడ్డి, మున్సిపాలిటీ అంబాడిజర్ సిరాజ్, మున్సిపల్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



● గ్రామ పంచాయతీల్లో పనుల పర్యవేక్షణ, నిర్వహణకు సాంకేతికత జత
● ఉదయం 7 గంటలకే విధులకు రావాలని ఆదేశం
● ఇబ్బంది పడుతున్న గ్రామ కార్యదర్శులు
● సర్వర్ మొరాయింపుతో యాప్‌తో ఫొటోలు జత చేయలేకపోతున్న కార్యదర్శులు
● 7 పంచాయతీల్లో కార్యదర్శుల పోస్టులు ఖాళీ

ప్రత్యేక యాప్‌తో.. పారిశుద్ధ్య పర్యవేక్షణ

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పర్యవేక్షణకు సాంకేతికతను జోడించడం వల్ల పంచాయతీ కార్యదర్శులకు పలు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి సంబంధించిన విధి విధానాలను ఉన్నతాధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు చేరవేయడంతో.. కార్యదర్శులు విధులకు గతంలో మాదిరిగా ఉదయం 9 గంటలకు కాకుండా ప్రస్తుతం ఉదయం 7 గంటలకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతీ రోజూ ఉదయం 8 గంటలలోపు వరకే కార్యదర్శులు పంచాయతీ కార్యాలయానికి చేరుకొని పారిశుద్ధ్య నివేదిక (డీఎస్ఆర్) యాప్‌లో తమ ఫొటోలను తీసి పంపించాల్సి ఉంటుంది. ఇలా పంపిస్తేనే వారు విధులకు హాజరైనట్లుగా గుర్తిస్తారు. లేని పక్షంలో గైర్హాజరైనట్లు పరిగణిస్తారు.

సర్వర్ మొరాయింపు..

గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్లు శుభ్రం చేయడం, కార్మికులు మురుగు కాల్వలు తీసే ఫొటోలు, కంపోస్ట్ షెడ్డు, వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జరిగే పనులను ఫొటోలు తీసి ఎప్పటికప్పుడు డీఎస్ఆర్ యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఇలా అందరూ ఒకేసారి యాప్‌లో పొందపర్చడం ద్వారా ఒక్కోసారి సర్వర్ మొరాయిస్తోందని చాలా మంది కార్యదర్శులు ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రక్రియలో వారు సొంత సెల్ ఫోన్లు వినియోగిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నెట్‌వర్క్ పనిచేయక నమోదుకు కష్టమవుతోందంటున్నారు.

మరో చోట నివాసం..

చాలా మంది గ్రామ కార్యదర్శులు పనిచేసే చోట కాకుండా నగరంలో నివాసం ఉండగా.. అధికారులు ఆదేశించిన సమయానికి రావాలంటే వ్యయ ప్రయాసాలకు గురికావల్సి వస్తోందని వాపోతున్నారు. మారుమూల గ్రామాలు, తండాల్లో పనిచేసే వారికి రోజూ ఇక్కట్లు తప్పడం లేదు. ముఖ్యంగా మహిళా కార్యదర్శుల ఇబ్బందులు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 61 పంచాయతీల్లో రోజూ జరిగే పారిశుద్ధ్య నిర్వహణ వివరాలను డీఎస్ఆర్ యాప్ నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

7 పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులే...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు ఉండగా, ఏడు గ్రామ పంచాయతీల్లో కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పక్కనున్న పంచాయతీ కార్యదర్శులను ఇన్‌చార్జిలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో.. లక్ష్యానికి అనుగుణంగా ఇంటి పన్నుతో సహా వివిధ రకాల పన్నుల వసూళ్లపై గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడుతోంది. డీఆర్ఎస్‌యాప్‌తో ఇన్‌చార్జి బాధ్యతల్లో అదనపు విధులు నిర్వహిస్తున్న గ్రామ కార్యదర్శులు మరిన్నీ సమస్యలు ఎదుర్కోవల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం మేడ్చల్ మండలంలో నాలుగు పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉండగా, శామీర్‌పేట్, ఘట్కేసర్, కీసర మండలాల్లో ఒక్కోటి చొప్పున గ్రామ కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడు గ్రామ పంచాయతీలు ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది.

మహిళలు అన్ని రంగాల్లో పనిచేస్తే ప్రపంచాన్నే జయించవచ్చు



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మంత్రి చామకూర మల్లారెడ్డి

మేడ్చల్: మహిళలు ఇంటి పనులకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణిస్తే దేశం నంబర్ వన్ స్థానంలో ఉంటుందని, మహిళలు క్రమశిక్షణతో పని చేస్తే ప్రపంచాన్నే జయించవచ్చని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్‌లో మంగళవారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చైనా అభివృద్ధి సాధించిందంటే కారణం ఆ దేశంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. భారత దేశంలో మహిళలు ఇంటి పనులకే పరిమితం అవుతున్నారని, ఇంటి పనులు చేస్తూనే మిగతా పనులపై దృష్టి సారిస్తే దేశం త్వరగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. మహిళా సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, మహిళా అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. సమావేశంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజావిజయానంద్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మహిళలు అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో పాలన పడకేసింది: ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



ఘట్‌కేసర్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పాలన పడకేసిందని, అభివృద్ధిపై అధికారులు సమీక్షలు కూడా నిర్వహించడం లేదని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులకు కేంద్రం ప్రవేశపెట్టిన సబ్సిడీ రుణాలను తెలంగాణలో ఇవ్వకుండా మోసం చేస్తుందన్నారని, కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిస్తే బీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతుందని తెలంగాణలో అమలు చేయడం లేదన్నారు. జిల్లాలోని మహిళలకు రూ.3లక్షల సబ్సిడీతో రూ.10 లక్షల రుణాలు ఇవ్వడం లేదన్నారు. అంకుషాపూర్–ఎన్ఎఫ్‌సీనగర్ రోడ్డు ఇంకా ప్రారంభం కాలేదని, గతేడాది జూన్ నుంచి నేటి వరకు పెన్షన్లు మంజూరు చేయడాన్ని ప్రభుత్వం ఆపించడం సిగ్గుచేటన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకుండా విద్యుత్ బిల్లుల చెక్కులు మాత్రం ప్రభుత్వం డ్రా చేసుకుంటుందని ఆరోపించారు. అవనీతికి అడ్డూఅదుపు లేకుండా పోతోందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం నేర్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

జీవో 59,118 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయండి

కలెక్టర్ అమయ్ కుమార్.

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆదేశాలకు అనుగునంగా జీఓ 59, 118 దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయాలని, అందుకోసం సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సూచనలు, నిబంధనల ప్రకారం ఇప్పటికీ పూర్తి కాని దరఖాస్తులు ఉంటే వాటిని ప్రత్యేకంగా పరిశీలించి వెంటనే పూర్తి చేయాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జీఓ 59 కింద అర్హులుగా గుర్తించిన దరఖాస్తుదారుల నుంచి క్రమబద్ధీకరణ సొమ్మును ప్రభుత్వం నిర్దేశించిన విధంగా విడతల వారీగా వసూలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీఓలు రవి, మల్లయ్య, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అండర్ పాస్ పనులు పూర్తి చేయాలని బీజేపీ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో రైల్వే అండర్ పాస్ పనులు త్వరగా పూర్తి చేయాలని మంగళవారం బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే పనులు పూర్తి కావడం లేదని అండర్‌పాస్ వద్ద నినదించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ.. పనులు ప్రారంభించి రెండేళ్లు గడిచినా పూర్తి కాకపోవడానికి కారణం బీఆర్ఎస్ ప్రభుత్వం పనులకు భూ కేటాయింపుల్లో జాప్యం చేయడం వల్లే అన్నారు. బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కిషన్, శ్రీధర్, అర్జున్‌బాబు, కృష్ణ, మహేశ్, సురేందర్ పాల్గొన్నారు.

నీటి నిల్వ పద్ధతులు అవలంబిస్తేనే మనుగడ

జిల్లా భూగర్భ జల శాఖ అధికారి కె.రేవతి



సాక్షి,మేడ్చల్ జిల్లా: అందరం కలసి కట్టుగా నీటి వృథాని అరికట్టి, పొదుపుగా వాడి, నిల్వ చేసుకునే పద్ధతులు అవలంబిస్తేనే మనుగడ సాధ్యమవుతుందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా భూగర్భ జల శాఖ అధికారి కె.రేవతి అన్నారు. నీటి ప్రాధాన్యత, పరిరక్షణపై ఐక్యరాజ్య సమితి ప్రతి సంవత్సరం మార్చి 22 అంతర్జాతీయ నీటి దినోత్సవంను నిర్వహిస్తోందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం అలియాబాద్ రైతు వేదికలో భూగర్భ జలాల వినియోగం, పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు, పొలంలో ఫారం పాండ్ (నీటి కుంటలు) నిర్మించుకోవాలని రేవతి సూచించారు. ఇళ్లలో నీటి వినియోగంపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జిల్లా భూగర్భ జల శాఖ అసిస్టెంట్ హైడ్రోజియోలోజిస్టులు డాక్టర్ సత్యనారాయణ, కార్తీక ప్రియ, శామీర్‌పేట్ మండల వ్యవసాయాధికారి రమేష్, అసిస్టెంట్ వ్యవసాయాధికారి రవియాదవ్ పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నీటి పొదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటిని ఆదా చేయాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం గ్రామ మహిళా సంఘాల నాయకులు, మహిళలతో నీటి బడ్జెట్‌పై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సలావుద్దిన్ సైఫీ, స్వాతి, సంతోష్, వెంకట్, శ్రీకాంత్, విక్రమ్, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో జెడ్పీటీసీ శైలజవిజయానంద్‌రెడ్డి, సర్పంచ్ కవిత జీవన్‌లతో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు యూనుస్ పాషా, సురేష్‌రెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, వైద్యులు పాల్గొన్నారు.



పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీపీ రజితరెడ్డి

రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగరంలోని బోయినపల్లి నుంచి మెదక్ జిల్లా శివారులోని కాళ్లకల్ వరకు విస్తరిస్తున్న 27 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారి విస్తరణ పనుల అభివృద్ధిపై సంబంధిత జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని న్విహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు నాణ్యతగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పనులు చేయించాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. నిధులకు ఎలాంటి ఇబ్బందులు లేనందున పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీఓలు రవి, మల్లయ్య, ఏసీపీ రామలింగరాజు, పోలీసు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జీతాల కోసం ఆందోళన

పోచారం: యమ్నంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో జీతాల కోసం అధ్యాపకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. డైరెక్టర్ చాంబర్‌లో అధ్యాపకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అందుకు యాజమాన్యం స్పందించి వారంలోపు జీతాల చెల్లింపులు జరుపుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మేయర్ కావ్య

జవహర్‌నగర్: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ అరుంధతి నగర్‌కు చెందిన విజయ్‌కి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు మేయర్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంతిబాబురావు, సత్యం, విక్రమ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల బ్యాగ్‌పై నుంచి కిందపడి వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: విధి నిర్వహణలో భాగంగా విత్తనాల బ్యాగ్‌పై కూర్చున్న వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా ఆంజనేయపురంకు చెందిన శ్రీనివాస్‌రావు కుటుంబంతో కలిసి మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో నివాసముంటూ స్థానిక గ్రోవేర్ అగ్రి సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం శ్రీనివాస్‌రావు కాళ్లు పక్షవాతంకు గురికావడంతో వైద్యులు ఒక కాలును మోకాలి వరకు తొలగించారు. దీంతో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న శ్రీనివాస్‌రావు గత సోమవారం నైట్ డ్యూటీకి వెళ్లగా విధుల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున విత్తనాల సంచులపై కూర్చున్నాడు. కొంత సమయానికి ప్రమాదవశాత్తు కిందపడటంతో గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: మానసిక ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నెల్లికుదూర్ గ్రామానికి చెందిన పందెం ప్రభు(33) పూడూర్ స్నేహ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కిష్టాపూర్‌లోని కంపెనీ క్వాటర్స్‌లో నివాసం ఉంటున్నాడు. గత సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో రూమ్ నుంచి బయటకి వెళ్లిన పందెం ప్రభు తిరిగి రాకపోవడంతో రాత్రి సమయంలో తోటి మిత్రులు అతడి ఆచూకీ కోసం వెతుకుతుండగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి వెంచర్‌లో రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా పందెం ప్రభుగా తోటి కార్మికులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

డ్రైనేజీ నిర్మాణం కోసం స్థల పరిశీలన



డ్రైనేజీ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ 18వ వార్డులో నూతనంగా డ్రైనేజీ నిర్మాణం కోసం మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్, స్థానిక కౌన్సిలర్ రవీందర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మురికి నీరు, వర్షం నీరు రోడ్లపై పారకుండా డ్రైనేజీ నిర్మించనున్నామని, స్వచ్ఛ వార్డుకు ప్రజలంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో జంగయ్యాయాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేడ్చల్: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ లక్ష్మీసంజీవయ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. గ్రామంలో ప్రతీ విధిలో సంపూర్ణ సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రకళ, సంజీవ, భిక్షపతి, మహేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీసీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మీ

ఘనాపూర్‌లో సమస్యలు లేకుండా చేస్తాం



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ గోపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో సమస్యలు లేకుండా చేస్తామని ఆ గ్రామ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి అన్నారు. ఘనాపూర్ అనుబంధ గ్రామం ఫకీర్ టెక్యా తండాలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఏమైనా సమస్య తలెత్తితే పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో అవసరమైన చోట రోడ్డు, డ్రైనేజీ నిర్మిస్తున్నామని, గ్రామాభివృద్ధికి ప్రజలంతా సహకరిచాలన్నారు. అనంతరం తండా పేరును సీతారాం తండాగా మార్చాలని ప్రజలు గ్రామసభలో చేతులెత్తి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ రూప్‌సింగ్, మాజీ ఉప సర్పంచ్ సత్తయ్యగౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ మహేందర్‌నాయక్, వార్డు సభ్యులు భాస్కర్, పవన్, కోఆప్షన్ సభ్యుడు సురేశ్, శివాజీనాయక్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీపీ రజితరెడ్డి

మేడ్చల్: గ్రామాల్లో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలను ఆ శాఖ అధికారులు వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ సరితతో రెవెన్యూ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను విన్నవించడంతో వాటిని పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ శైలజావిజయానంద్‌రెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, వైస్ ఎంపీపీ వెంకటేషం, కోఆప్షన్ సభ్యురాలు రుక్సానా యూనుస్ పాషా, సర్పంచ్‌లు గణేష్, శేఖర్, మంగ్యానాయక్, కవితజీవన్, పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన

ఘట్‌కేసర్: డ్రోన్ ద్వారా పంట పొలాల్లో మందుల పిచికారి చేసే విధానంపై ఎదులాబాద్ రైతు వేదికలో ఐసీఏఆర్–ఐఐఆర్ శాస్త్రవేత్తలు రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జేసుదాసు, చిన్నబాబు నాయక్, బస్వరాజ్, ఉప సర్పంచ్ లింగేశ్వర్ రావు, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ఉదయ్‌రెడ్డి, రైతులు పండరిముదిరాజ్, సత్తయ్య, భిక్షపతి, అమర్‌నాథ్, మండల వ్యవసాయ సహాయ అధికారి సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సమస్యలపై మంత్రికి సర్పంచ్‌ల వినతి



మంత్రి మల్లారెడ్డితో మండల సర్పంచ్‌లు

మేడ్చల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరింపజేయాలని మండల సర్పంచ్‌లు మంత్రి మల్లారెడ్డిని కోరారు. ఈ మేరకు సర్పంచ్‌లు మండల పరిషత్ కార్యాలయం వద్ద మంత్రిని కలిసి సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. చాలా ఏళ్లుగా కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా మిగిలిపోయాయని, వాటికి పరిష్కార మార్గాలు చూపా లని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సర్పంచ్‌లు గణేష్, మహేందర్, కరుణాకర్, శేఖర్, నాయకులు రాజమల్లారెడ్డి, భాగ్యారెడ్డి, సురేష్‌రెడ్డి, జీవన్ ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు జీఓ నంబర్ 11 ద్వారా వేతనాలు పెంచడంతో సంస్థ ఉద్యోగులతో కలిసి మంత్రి మల్లారెడ్డి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అందరి సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానంద్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి, మేడ్చల్, డబీల్‌పూర పీఏసీఎస్ చైర్మన్లు రందీప్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేషం, ఎంపీడీఓ పద్మావతి, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.